ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శనివారం 07 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

## మహబూబ్‌నగర్ జిల్లాలో
# స్వల్ప స్థాయి భూప్రకంపనలు



మహబూబ్ నగర్: మహబూబ్ నగర్ జిల్లాల్లో స్వల్పస్థాయిలో భూప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేల్ పై వీటి తీవ్రత 3గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. కౌకుంట్ల మండలం దాసరపల్లె కేంద్రంగా మధ్యాహ్నం 12.15 గంటలకు భూ ప్రకంపనలు వచ్చాయి. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

## గవర్నర్‌కు, కేసీఆర్‌కు, కిషన్‌రెడ్డికి
# ఆహ్వానం



హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్‌ను ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. రాజ్ భవన్‌లో గవర్నర్‌ను, దిల్ కుషా అతిథిగృహంలో కిషన్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానపత్రాలు అందజేశారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఉన్నారు.



కేసీఆర్ ఫాం హౌస్లోకి వెళ్తున్న మంత్రి కాన్వాయ్‌లు

## తెలంగాణతల్లి రూపం మార్చడంపై
# పిటిషన్

### విగ్రహ ప్రతిష్ఠ నిలిపేసేలా ఆదేశాలు ఇవ్వాలని
### జూలూరు గౌరీశంకర్ దాఖలు



హైదరాబాద్: సచివాలయంలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. విగ్రహ ప్రతిష్ఠ నిలిపేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జూలూరు గౌరీశంకర్ పిటిషన్ దాఖలు చేశారు. విగ్రహం రూపం మార్చడం వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. గౌరీ శంకర్ దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. సచివాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈనెల 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్న విషయం తెలిసిందే.



# నల్లగొండలో సీఎం పర్యటన

### బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతలకు,
### యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండోదశ పనులకు ప్రారంభోత్సవం



నల్లగొండ : నల్గొండ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ అభివృద్ధికార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేయనున్నారు. బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతలను ప్రారంభించనున్నారు.
యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ పనులు, నల్గొండ వైద్య కాలేజీ కొత్త భవనాలకు ప్రారంభోత్సం చేస్తున్నారు. అనంతరం గంధవారిగూడెం సమీపంలో బహిరంగ సభలో పాల్గొని సీఎం ప్రసంగిస్తారు.

## లైన్ క్లియర్

### ఇక 51 పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం

హైదరాబాద్: 51 గ్రామ పంచాయతీలు సమీప మున్సిపాలిటీల్లో విలీనం కానున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో..ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ గెజిట్ జారీ అయ్యింది. గ్రామ పంచాయతీల విలీనాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో పంచాయతీల విలీనానికి లైన్ క్లియర్ అయినట్లయింది.

## గిన్నిస్ లో భారీ కేక్‌కు చోటు

హైదరాబాద్ : హార్లీస్ ఇండియా ఫైన్ బేకింగ్ ఆధ్వర్యంలో తయారు చేసిన 2వేల కిలోలకుపైగా భారీ కేకుకు గిన్నిస్ బుక్ రికార్డ్స్ లో చోటు దక్కింది. ఈ భారీ కేకును హైదరాబాద్ లోని కొండాపూర్ మాయా కన్వెన్షన్ సెంటర్ లో ప్రదర్శనకు ఉంచారు. ప్రపంచంలోనే అతిపెద్ద రష్యన్ మెడోవిక్ హనీ కేక్ ను రూపొందించడంతో ఈ మైలురాయిని చేరుకుంది. ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లండన్ ప్రతినిధిగా రీతూనాథ్ పాల్గొని తయారీ విధానం, ఉపయోగించిన ముడి పదార్థాలను దగ్గరుండి పరిశీలించారు. భారీ కేకు చిన్నారులను, ఆహార ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది.



## సీఎంను కలిసిన
# దిల్ రాజు



హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నూతన చైర్మన్ దిల్ రాజ్ గారు మర్యాద పూర్వకంగా కలిశారు. తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## గాంధీ భవన్ బోసిపోతోంది..
# తెలంగాణ భవన్ కళకళలాడుతోంది..

### ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై విరిగిన ప్రజలు మనసు
### మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : ఈ ఏడాది పాలనలోనే తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై మనసు విరిగిందని, మళ్లీ అధికారం కేసీఆర్‌కే దక్కుతుందని ఓ సర్వే ప్రతినిధి చెప్పినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్ ప్రివ్యూ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తే ఎలా ఉంటుందో చెప్పారు. ఆయన చెప్పిన మాట ఏంటంటే.. సహజంగా ఏ ప్రభుత్వం మీద అయినా మూడు, నాలుగేండ్ల తర్వాత కోపం వస్తది.. తెలంగాణ ప్రజలకు ఓపిక పట్టే గుణం ఉంది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఏడాదిలోనే మనసు విరిగిందన్నారు. గాంధీ భవన్ బోసిపోతోంది తెలంగాణ భవన్ నిత్యం కళకళలాడుతోందన్నారు. లగచర్ల గిరిజన ఆడబిడ్డలు అందరూ వచ్చి తమ కుటుంబ సభ్యులను జైలు నుంచి విడిపించాలని కోరారు. వారి విడుదల కోసం లీగల్ సెల్ బృందం కష్టపడి న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. గిరిజన రైతులను బయటకు తీసుకొస్తామని ధైర్యం చెప్పానన్నారు.